విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

రెడ్‌క్రాస్ సేవలు స్ఫూర్తి దాయకం

విశాలాంధ్ర - కాకినాడ : ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే సత్సంకల్పంతో రెడ్‌క్రాస్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య పేర్కొన్నారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో గురువారం ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలు సంభవించే సమయాలలో తీసుకోవలసిన రక్షణ చర్యలపై సుమారు 850 మంది సచివాలయ ఉద్యోగులకు 'రెడ్‌క్రాస్ ప్రాణమిత్ర వలంటీర్స్' పేరుతో శిక్షణ ఇచ్చారు. ఓఎన్‌జీసీ సహకారంతో జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ మూడు రోజులపాటు ఈ ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. కాకినాడసిటీ, రూరల్, తాళ్ళరేవు, తుని, ఉప్పాడ కొత్తపల్లి సహా వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులకు మూడు రోజులపాటు ఈ శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు జరిగిన సమయాల్లో ప్రాణ, ఆస్తినష్టం ఎలా నివారించాలి? ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే అంశంపై ఈ శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన ప్రాణమిత్ర వలంటీర్లకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలనే దృక్పథాన్ని ప్రతీ ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. జీవన గమనంలో 'సేవ' అన్నది ఒక అలవాటుగా మార్చుకోవాలని ఆయన సూచించారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె వెంకటరావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ ఎన్నో ప్రజాప్రయోజన ప్రాజెక్టులను అమలు చేస్తోందని అభినందించారు. ప్రధానంగా ప్రాణమిత్ర వలంటీర్ల పేరిట ఇచ్చిన శిక్షణా కార్యక్రమం ఆపద సమయంలో ఎంతో మందికి అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనుపమ్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలలో రెడ్‌క్రాస్ ఎంతో సేవా స్ఫూర్తితో పనిచేస్తోందని, ఆ సంస్థకు తమ వంతు తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు మాట్లాడుతూ రక్తదాన శిబిరాలతోపాటు, వృద్ధాశ్రమాలు నిర్వహణ సహా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందుకు ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా గోల్డ్‌మెడల్ కూడా సాధించామన్నారు 70 పుష్‌కార్ట్స్ సమకూర్చిన ఓఎన్‌జీసీ కాకినాడ నగరపాలకసంస్థ ప్రజారోగ్య విభాగానికి రూ.10 లక్షలు వ్యయంతో 70 పుష్‌కార్ట్స్‌ను ఓఎన్‌జీసీ సంస్థ సమకూర్చింది. వీటిని జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య నగరపాలక సంస్థకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటరీ సూపర్‌వైజర్ జిలానీ, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ప్రాణమిత్ర వలంటీర్లు పాల్గొన్నారు.

యువత ఓటింగ్‌లో పాల్గొనాలి

విశాలాంధ్ర - అమలాపురం : దేశంలో 50 శాతం పైగా ఉన్న యువత రాబోవు ఎన్నికలలో ఓటింగ్‌లో పాల్గొనాలని, ప్రధాన భూమిక వహించాలని సిటిజన్స్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఓడలరేవులోని బివిసి ఇంజనీరింగ్ కళాశాలలో ఓటు వేద్దాం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం అనే అంశంపై జరిగిన కళాజాత కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి వివిఎస్‌ఏ అధ్యక్షత వహించారు. వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ గత చట్టసభలలో ఒకప్పుడు త్యాగధనులు, మేధావులు, దేశభక్తులు ఉండేవారని నేడు క్రిమినల్స్, ధనార్జనపరులు, కాంట్రాక్టర్లు ఉంటున్నారని ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారిందన్నారు. భారతదేశంలో అత్యధిక ఎన్నికల వ్యయం జరిగే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మారుతుందని ఇసుక, మట్టి, గనుల మాఫియా, మద్యం మాఫియా, ఫ్యాక్షనిస్టులు ఎన్నికల రంగంలో దిగి పోటీ పడుతున్నారని అన్నారు. పట్టణ ప్రాంతాలలో ఓటింగ్ శాతం పెంచడానికి కళాజాతను అన్ని జిల్లాల జిల్లా కేంద్రాలలో నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి ప్రసంగిస్తూ ఓటు హక్కు రామబాణం లాంటిదని ఈ హక్కును విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకొని, మంచి పాలకులను ఎన్నుకోవాలని కోరారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నేత డాక్టర్ ఈఆర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉన్న ఇండియాలో అవినీతి రహిత, అభివృద్ధికి తోడ్పడే సుస్థిర పాలన అందించే ప్రభుత్వాలను ఎన్ను కోవాలని కోరారు. లోక్‌సత్తా ఉద్యమ నేత ఉప్పుగంటి భాస్కరరావు ప్రసంగిస్తూ, డబ్బు, మద్యం లాంటి ప్రలోభాలకులోనై అనర్హులను గెలిపిస్తే సమాజం తిరోగమిస్తుందని తెలిపారు. కళాశాల డీన్ డాక్టర్ టీవీ జనార్దన్ రావు ప్రసంగిస్తూ రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఐదు సంవత్సరాలు గడిచాయని ఆవేదన వ్యక్తం చేస్తూ ఉత్తమ ప్రభుత్వాలను ఎన్నుకోవడం ద్వారా అభివృద్ధికి నాంది పలికాలన్నారు. ఈ సందర్భంగా రంగం ప్రజా సాంస్కృతిక వేదిక ఆర్. రాజేష్ నేతృత్వంలో 12 మందితో కూడిన కళాకారుల బృందం ఆట మాట పాటలతో ఓటర్లను జాగృతులను చేసే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సభికులను ఆలోచింప చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీపాద రామకృష్ణ స్వాగత ఉపన్యాసం చేశారు. వందలాది మంది విద్యార్థులు కళారూపాలను ఆస్వాదించి తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకుంటామని, ఓటు అంబాసిడర్‌గా మారి ఓటింగ్ శాతాన్ని పెంచడానికి కృషి చేస్తామని తెలిపారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

హాజరుకాని పలువురు అధికారులు

విశాలాంధ్ర - సామర్లకోట : పంచరామ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఆలయ ఈవో నీలకంఠం అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. కాకినాడ ఆర్డీవో ఆధ్వర్యంలో నిర్వహించవలసిన ఈ సమీక్షా సమావేశానికి కాకినాడ ఆర్డిఓ, పలువురు అధికారులు హాజరు కాకపోవడం గమనార్హం. నేతలు దవులూరి సుబ్బారావు, కౌన్సిలర్లు సేపేని సురేష్, యార్లగడ్డ జగదీష్, నేతల హరిబాబు అగ్నిమాపక శాఖ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రామారావు, రెవెన్యూ డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాస్, మానవ హక్కుల సంఘం అప్పలకొండ, బిక్కిన సాయి, కాపుగంటి పైడి రత్నం తదితరులు పాల్గొన్నారు, ఉత్సవాలకు సంబంధించి గోడపత్రికలను ఆవిష్కరించారు.

వ్యక్తిగత దూషణలు మానుకోవాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : జనసేనపార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పాఠంశెట్టి సూర్యచంద్ర మతిభ్రమించి మాట్లాడుతున్నారని టిడిపి నాయకులు మండిపడ్డారు. టిడిపి జగ్గంపేట నియోజకవర్గ కార్యాలయంలో టిడిపి నాయకులు, సూర్యచంద్ర అన్నయ్య బాబ్జి గురువారం వేర్వేరుగా మీడియా సమావేశం నిర్వహించారు. తొలి సమావేశంలో బాబ్జి మాట్లాడుతూ నెహ్రూ ద్వారానే నా తమ్ముడు రాజకీయాల్లోకి వచ్చాడన్నారు. అటువంటి నెహ్రూ పై దూషణలు చేయడాన్ని నేను తట్టుకోలేక మీడియా ముందుకు రావడం జరిగిందన్నారు. టిడిపి, జనసేన పార్టీల పొత్తులో భాగంగా ఇక్కడ సీటును టిడిపి నేత నెహ్రూకు కేటాయించినట్లు తెలిపారు. పార్టీ ఇన్చార్జిగా పొత్తు ధర్మాన్ని పాటిస్తానని, నెహ్రూను గెలిపిస్తాను అని మొదట అని, ఇప్పుడు నేను గెలిపించను అనడం కరెక్ట్ కాదన్నారు. ఆమరణ నిరాహార దీక్ష చేయడంవల్ల సీటు రాదని, పొత్తు ధర్మం ప్రకారం ఒకరికే వస్తుంది కాబట్టి నెహ్రూకు సపోర్ట్ చేద్దాం కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొత్త కొండబాబు, చిరంజీవి, కెంగం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు పున: ప్రారంభించాలి

కలెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర - కాకినాడ : దేశవ్యాప్తంగా ఒకే తరహాలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏపీ బిల్డింగ్ & అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా కాకినాడలో గురువారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఇంద్ర పాలెం అంబేద్కర్ విగ్రహం వద్ద భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి. అన్నవరం అధ్యక్షతన నిరసన, ధర్నా జరిగింది. ఈ ధర్నాకు ముఖ్య అతిథులుగా ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధ సంఘం) రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్దిరెడ్డి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఒకే తరహాలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలని, ఇతర రాష్ట్రాల్లో ఇస్తున్న పథకాలు ఆంధ్ర రాష్ట్రంలో కూడా అమలు చేయాలని, ఈ రాష్ట్ర ప్రభుత్వం వాడుకున్న నిధులు సంక్షేమ బోర్డుకి తిరిగి జమ చేయాలని అన్నారు. తోకల ప్రసాద్ మాట్లాడుతూ అసంఘటిత రంగ భవన నిర్మాణ కార్మికులు రెక్కాడితేనే కానీ డొక్కనిండని కార్మికులు భవన నిర్మాణ కార్మికులని, వారి నిధులను రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2019 నుండి ఇప్పటివరకు అనేక కోట్ల రూపాయలు ప్రభుత్వం దుర్వినియోగించిందని, ఈ జిల్లాలోనే 2045 క్లెయిమ్స్ పెండింగ్లో ఉన్నాయని, సుమారు 5 కోట్ల 62 లక్షల నిధులు పెండింగ్లో ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా యాక్సిడెంట్ క్లైమ్ 5,60,000, సాధారణ మరణం లక్ష 30000, మ్యారేజ్ గిఫ్ట్ 30000, డెలివరీ 30000 తదితర క్లెయిమ్స్ బోర్డు ద్వారా అమలు జరుగుతున్నాయని అన్నారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు పప్పు ఆదినారాయణ, ఎమ్మెస్, అర్జున్ రావు, శేఖర్, శ్రీను, బాబురావు, భాష, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పథకాలను దేశవ్యాపతంగా ఒకేవిధంగా అమలుచేయాలని , జగన్ ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేశారని, దీనిని వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ ఏపీ బిల్డింగ్ అథర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయుసి ఆధ్వర్యంలో గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి తాటిపాక మధు, కుంద్రపు రాంబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అందే ప్రభుత్వ ఆర్థిక సహాయం మంజూరు కావడం లేదన్నారు. 2019 తర్వాత ఒక్క రూపాయి కూడా సంక్షేమ బోర్డు నుండి విడుదల చేయలేదని, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారుగా ఐదు కోట్ల రూపాయలు క్లెయిమ్స్ నిధులు పెండింగ్లో ఉన్నాయని, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు నిరాశ చూపించి భవన నిర్మాణ కార్మికుల కోట్లాది రూపాయల నిధులను సంక్షేమ పథకాలకు తరలిస్తూ భవన నిర్మాణ కార్మికులకు మొండి చేయి చూపిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ధరల వల్ల భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువైందని, భవన నిర్మాణ కార్మికులకు ప్రమాదాలు జరిగినా ప్రభుత్వ స్పందించడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వి. కొండలరావు, నగర సహాయ కార్యదర్శి సప్ప రమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.శ్రీనువాస్, చింతలపూడి సునీల్, పార్టీ నగర కార్యవర్గ సభ్యులు నల్ల రామారావు, టి. నాగేశ్వరరావు, ఎం. సాగర్, జట్ల సంఘం అధికార బాడీ వెంకట రావు, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం సాగునీరు పంపిణీ

కలెక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : రబీ సీజన్‌లో ప్రణాళికాబద్ధంగా సాగునీరు పంపిణీ చేపట్టి, శివారు భూములకు సాగునీరు ఎద్దడి లేకుండా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రబీ సీజన్‌లో సాగునీరు పంపిణీ ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, రెవిన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాకినాడ జిల్లాలో గోదావరి, ఏలేరు, పంపా రిజర్వాయర్ ఆయకట్ల కింద సాగవుతున్న పంటల వివరాలు, సాగునీరు లభ్యత, కాలువల పరిస్థితులను కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులతో చర్చించారు. సాగు నీటి పంపిణీ, నియంత్రణలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి రానున్న రెండు నెలలు అత్యంత కీలకమని ఇరిగేషన్, వ్యవసాయ అధికారుల ప్రణాళిక ప్రకారం పని చేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు. ఇందుకు రెవిన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె తెలిపారు. జిల్లాలో గోదావరి ఆయకట్టు కింద - 1.35 లక్షల ఎకరాలు, ఏలేరు ఆయకట్టు కింద- 53 వేల ఎకరాల, పంపా రిజర్వాయర్ కింద సుమారుగా 10వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా డి తిప్పే నాయక్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జె సీతారామరావు, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ ఎన్ విజయ్ కుమార్, ధవళేశ్వరం నీటిపారుదల శాఖ ఎస్‌ఈ జి. శ్రీనివాస రావు, పెద్దాపురం ఈఈ డి.రామ్ గోపాల్, పెద్దాపురం, కాకినాడ డీఈలు కె. నరేష్, ఎ.రవి, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో మహాసేన రాజేష్ పర్యటన



విశాలాంధ్ర - అమలాపురం/పి గన్నవరం : పి గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలంలో తెలుగుదేశం, జనసేన పార్టీ ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి మహాసేన రాజేష్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మొట్టమొదటి సారి నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా మండలంలోని ముక్తేశ్వరం ప్రధాన కూడలిలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం దివంగత నేత వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రంగా విగ్రహానికి ముద్దు పెట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ పరిస్థితులపై తనకు అవగాహన లేకపోయినప్పటికీ, ప్రజలతో పరిచయం లేకపోయినప్ప టికీ ప్రజలందరూ తనను అభిమానిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అయినవిల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి మద్దా చంటిబాబు, తదితరులు ఉన్నారు.

మహాసేన రాజేష్‌కు నిరసన సెగ

విశాలాంధ్ర - అమలాపురం/ పి గన్నవరం : తెలుగుదేశం, జనసేన పార్టీ ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థిగా నియమితులై పి గన్నవరం నియోజకవర్గానికి తొలిసారి విచ్చేసిన మహాసేన రాజేష్‌కు అయిన విల్లి మండలంలో నిరసనల సెగ తగిలింది. మహాసేన రాజేష్‌ను భజరంగ్ దళ్ కార్యకర్తలు గురువారం అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో అయినవిల్లి వినాయకుని దేవాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేశారు. రాజేష్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించిన శిరంగు నాయుడు స్వామిలను పోలీసులు అరెస్టు చేసి అంబాజీపేట పోలీసుస్టేషన్‌కు తరలించారు. హిందూ దేవతలపై రాజేష్ ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎస్సీ నాయకులు బొండాడ నాగమణి, బడుగు భాస్కర జోగేష్, జాలెం సుబ్బారావు, నక్కా సత్యనారాయణ, గోగి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - సామర్లకోట : ట్రూగాస్పాల్ చర్చి, చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రిస్టియన్ మెడికల్ హాస్పటల్, పిఠాపురం వారిచే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గురువారం సామర్లకోట బ్రౌన్ పేట సెంటర్ ట్రూగాస్పాల్ చర్చిలో నిర్వాహకులు రెవ డాక్టర్ సువార్తరాజు, షారోన్ సువార్తరాజులు ఏర్పాటు చేయగా సామర్లకోట మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజేష్ పాల్గొని ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కంటి వైద్య శిబిరంలో క్రిస్టియన్ మెడికల్ హాస్పిటల్ డాక్టర్స్ పాల్గొని శిబిరానికి హాజరైన సుమారు 200 మందికి అన్ని రకముల కంటి సమస్యలు చూసి, ఉచితంగా కంటి పరీక్షలు జరిపి మందులను అందజేసి 20 మందికి కంటి ఆపరేషన్లు చేసేందుకు పిఠాపురం తరలించారు. ఈ కార్యక్రమం మానవ హక్కుల సంఘం నాయకులు నూతలపాటి అప్పలకొండ, సిఎంసి డాక్టర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న సానా సతీష్ బాబు

రూ.50వేలు బాధితుడి కుటుంబానికి అందజేత

విశాలాంధ్ర - కాకినాడ : ప్రముఖ సామాజికవేత్త సానా సతీష్ బాబు తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. తుని నియోజకవర్గం కోటనందూరు మండలం పాతకొట్టం గ్రామస్తుడు కందికట్ల నూకరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా నాణ్యమైన వైద్యాన్ని పొందలేకపోతున్నారు. విషయం తెలుసుకున్న సానా సతీష్ బాబు నూకరాజు వైద్యాన్ని ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు అతని కుటుంబ సభ్యులకు రూ.50వేలను చికిత్స నిమిత్తం సానా సతీష్ బాబు ఫౌండేషన్ ద్వారా గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సానా సతీష్ బాబు ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల కాలనీ రోడ్డుపై రాజకీయం తగదు

విశాలాంధ్ర - కరప : పారిశుద్ధ్య కార్మికుల కాలనీ, కాపుల కాలనీకి వెళ్లే రోడ్డుపై తెరవెనక రాజకీయం చేయడం తగదని పారిశుద్ధ్య కార్మికుల కాలనీ పెద్దలు బంగారు రాజబాబు, కసింకోట సత్యనారాయణ, కే ఆనందరావు, రాయవరపు సత్తిబాబు కాపు కాలనీ పెద్దలు మేడిశెట్టి చంద్రరావు పేర్కొన్నారు. కాకినాడ రూరల్ శాసనసభ్యులు, మాజీ మంత్రి, కురసాల కన్నబాబు, సుమారు రూ.15 లక్షలు వెచ్చించి ఈ రెండు కాలనీలను అనుసంధానం చేసేందుకు సీసీ రోడ్డును వేయిస్తుంటే కొందరు నాయకులు పనిగట్టుకుని తెరవెనక రాజకీయం చేస్తూ కురసాల కన్నబాబు పేరును అప్రతిష్టపాలు చేస్తున్నారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కనక నాగేంద్ర కుమార్ పంచాయితీ స్థలాన్ని సర్వే చేయించి రోడ్డుకు అటు ఇటు అడ్డుగా ఉన్న చెట్లను, పొదలను తొలగించి రోడ్డు వేయిస్తుంటే కొందరు పనిగట్టుకుని రోడ్డు వేసేందుకు వీలులేదని అధికారులకు ఫిర్యాదు చేయడం చాలా దారుణమని పిడిఎఫ్ పత్రికల్లో రాయించడం విడ్డూరంగా ఉందని రాజబాబు తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం 15% నిధులు ఎస్సీ కాలనీలలో రోడ్లు డ్రైనేజీలు ఇతర పనులకు వెచ్చించవలసి ఉన్నప్పటికీ ఎస్సీ కాలనీలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్న చందంగా తయారైందన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా వలంటీర్లు

విశాలాంధ్ర -దేవరపల్లి: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వలంటీర్లు వారధిగా పనిచేస్తున్నారని రాష్ట్ర హెూంశాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వలంటీర్లకు సత్కారం చేశారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మానస పుత్రిక అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసి జి. జనార్దన్ రావు, వైసిపి నేతలు కూచిపూడి సతీష్, కుసునూరి వెంకట సతీష్, గడ రాంబాబు, పచ్చ రాంగోపాల్, కడిమి రాజు, వైస్ ఎంపీపీలు అరుణ సుబ్బారావు, మహిళా నేతలు ఆచంట అనసూయ, గారపాటి రమాప్రభ, డాక్టర్ లత తదితరులు పాల్గొన్నారు.

విలాయత్ అలీకి సత్కారం

విశాలాంధ్ర - ముమ్మిడివరం : జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖలో సుదీర్ఘ కాలం వివిధ హెూదాలలో పని చేసి డివిజనల్ పౌర సంబంధాల అధికారిగా పదవీ విరమణ చేసిన ఎండి విలాయత్ అలీ విశ్రాంత జీవితం కుటుంబ సభ్యులతో సుఖ శాంతులతో గడపాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె. లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. గురువారం స్థానిక ఎయిమ్స్ కళాశాలలోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది పదవి విరమణ చేసిన డివిజనల్ పి ఆర్ ఓ ఎండి విలా యత్ అలీని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డిపిఆర్‌ఓ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కోనసీమ జిల్లాలో పాత్రికే యులకు అక్రిడేషన్ కార్డులు మం జూరులో డివిజనల్ పిఆర్‌ఓ విలాయత్ అలీ పూర్తి సహకారం అందించారన్నారు. సంయుక్త సమాచార కార్య నిర్వాహక ఇంజనీర్ కె. శ్రీనివాస రావు మాట్లా డుతూ పౌర సంబంధాల అధికారిగా ఎంతో క్లిష్టమైన పనులు నిర్వహించాల్సి ఉంటుందని తన శక్తి సామర్థ్యాలతో ఒక ప్రక్క జిల్లాస్థాయి అధికారులను, మరోపక్క పాత్రికేయులను సమన్వయపరుస్తూ సమయ స్ఫూర్తితో విధి నిర్వహణలో మంచి పేరు ప్రఖ్యాతులు గడిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీ, టైపిస్టులు కే భారతి శర్వాణి, కార్యాలయ రికార్డు అసిస్టెంట్ ఆర్ఎస్ కుమార్, కార్యాలయ సభార్డినేట్లు ఎన్ చిట్టి రాజు, ఎం సతీష్ కుమార్ జి రాజు, విఘ్నేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం

రాష్ట్ర హెూం, విపత్తుల శాఖమంత్రి తానేటి వనిత

విశాలాంధ్ర - గోపాలపురం : గ్రామస్థాయి పరిపాలనకు గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని పౌర సేవలు అందిస్తున్నామని హెూం మంత్రి తానేటి వనిత తెలిపారు. గురువారం మండలంలోని సంజీవపురం, దొండపూడి, సగ్గొండ గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ సచివాలయం రైతు భరోసా కేంద్రాలు జగనన్న ఆరోగ్య కేంద్రాలు మంత్రి తానేటి వనిత లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ప్రతి కుటుంబానికి విద్య, వైద్య, ఆరోగ్యం, రైతు, కార్మిక, కర్షక వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందించామని తెలిపారు. ఇందులో భాగంగా గత ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధి, సంక్షేమం నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు ఇళ్ల శ్రీరామమూర్తి, మల్లిపూడి అచ్చిబాబు, ఎండపల్లి కవితా శేఖర్ బాబు, రాష్ట్ర అతిరస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత శ్రీను, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్యచంద్ర విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ

విశాలాంధ్ర - సీతానగరం: సూర్యచంద్ర విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చూపారు. మండలంలో చినకొండేపూడి గ్రామంలోని సూర్యచంద్ర ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యా ర్థులు గత నవంబర్ నెలలో సిల్వర్ జోన్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారు నిర్వహించిన ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఆఫ్ సైన్స్ ఎగ్జామ్స్‌లో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు సుమారు 200 మంది విద్యా ర్థులు పరీక్షకు హాజరుకాగా వారిలో 30 బంగారు, 20 వెండి, 20 కాంస్య పతకాలు సాధించారు. నూటికి నూరు మార్కులు సాధించి జోనల్ స్థాయిలో మొదటి స్థానంలో ఆరుగురు విద్యార్థులు నిలిచారని పాఠశాల కర స్పాండెంట్ లక్ష్మి ప్రసన్న రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ జి కనక రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులు ఫణీంద్ర రావు, ఇన్చార్జి రామకృష్ణ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో శెట్టిబలిజలు లేరా?

కులం సర్టిఫికెట్ కోసం అగచాట్లు

విశాలాంధ్ర - కాట్రేనికోన : పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రంలో శెట్టి బలిజ కులస్తులను బీసీల జాబితా నుంచి తొలగించడంతో అక్కడి వారు కొంతకాలంగా ప్రభుత్వంతో పోరాటం చేసినా ఫలితం లేక ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యం ఇలా ఉండగా ఆంధ్రలోనూ తాజాగా శెట్టిబలిజ కులస్తులకు కులం సర్టిఫికెట్ సమస్య ఎదురయ్యింది. అధికారుల నిర్లక్ష్యమో లేక సాంకేతిక సమస్యో తెలీదు గానీ కొన్ని నెలలుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో శెట్టిబలిజ కులస్తులకు కులం సర్టిఫికెట్ మంజూరు అవ్వక అనేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం గ్రామ, వార్డు సచివాలయాలలోనూ కులం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వీలు లేకుండా పోయింది. సచివాలయాల్లో ఏపీ సేవా పోర్టులలో కుల సర్టిఫికెట్ దరఖాస్తు చేసుకునే సమయంలో కంప్యూటర్‌లో డ్రాప్ బాక్స్‌లో 50 వరకు బీసీ కులాలు పేర్లు ఉన్న శెట్టిబలిజ కులం మాత్రం లేకుండా పోయింది. ఎవరైనా శెట్టిబలిజ కులం సర్టిఫికెట్ కొరకు దరఖాస్తు చేసుకుంటే అంబేద్కర్ కోనసీమ జిల్లాలో శెట్టిబలిజ కులం బిసి బి లేదంటూ ఎలర్ట్ మెసేజ్ దర్శనమిస్తోంది. వీరికి రీ ఇష్యూ సర్టిఫికెట్ కూడా రావడం లేదు. మీ సేవా కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి. ఓ పక్క కులం సర్టిఫికెట్లు రాక శెట్టిబలిజ కులానికి చెందిన విద్యార్థులు, నిరుద్యోగులు అనేక అవకాశాలు కోల్పోవడమే కాకుండా, ఇతరులు సంక్షేమ పథకాకు దరఖాస్తులు పెట్టుకునేందుకు కులం సర్టిఫికెట్ అవాంతరం కావడంతో తీవ్రఇబ్బంది పడుతుండగా, దరఖాస్తు దారులకు ఏం చెప్పాలో పాలు పోక సచివాలయం సిబ్బంది, మీసేవ ఆపరేటర్లు తలలు పట్టుకుంటున్నారు. ఈ సమస్యపై పై అధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కారానికి కాలయాపన జరుగుతోందని వారు వాపోతున్నారు. రాష్ట్రంలోని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో శెట్టి బలజ కులస్తులు ముఖ్యంగా అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే అధికంగా ఉంటారు. కొత్త జిల్లాల ఆవిర్భావం నుండి శెట్టిబలిజ కులస్తులు ఓబీసీ సర్టిఫికెట్లు తీసుకు నేందుకు ఇబ్బంది పడుతుండగా, తాజాగా కులం సర్టిఫికెట్లు తీసుకునేందుకు నానా అవస్థలు పడుతూ నష్టపోతున్నారు. ఆధునిక టెక్నాలజీ, భారీ యంత్రాంగంతో సచివాలయ వ్యవస్థను నడుపుతున్న చిన్నపాటి సాంకేతిక సమస్యను పరిష్కరించ డంలో జాప్యం జరుగుతోందని ఆ వర్గాల వారు ఆవేదన చెందుతున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సకాలంలో అన్ని సేవలు అందిస్తున్నామని చెప్పుకునే అధికార నాయక గణానికి ఈ సమస్య పట్టదా?అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా తక్షణ చర్యలు చేపట్టి శెట్టిబలిజ కులస్తులకు కులం సర్టిఫికెట్లు సజావుగా మంజూరయ్యేలా చూడాలని ఆ వర్గాల వారు ముక్త కంఠంతో కోరుతున్నారు.

తాడేపల్లిగూడెం సభ అట్టర్‌ఫ్లాప్ : అంబటి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : తాడేపల్లి గూడెంలో జరిగిన జనసేన, టిడిపి కార్యక్రమం అట్టర్ ఫ్లాప్ అయ్యిందని వైసీపీ నాయకులు అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. గురువారం రాజ మహేంద్రవరం సెల్టన్ టవర్‌లో జరిగిన మీడియా సమావేశంలో అంబటి రాంబాబు మాట్లాడుతూ తాడేపల్లిలో జరిగిన సభ జెండాల సభతప్పితే రాజకీయ సభ కాదని, పవన్ కళ్యాణ్ రాజకీయాలకు పనికిరాని అసమర్థుడని అన్నారు. జగన్మోహన్ రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు లేని వాడు పవన్ అన్నారు. నీ నాలుగో పెళ్ళాం ఎవరో కాదు నాదెండ్ల మనోహర్ అని, జగన్ మీ అందరికీ మొగుడని ఎద్దేవా చేశారు. చంద్ర బాబు నాయుడుకు, తెలుగు దేశం పార్టీకి పవర్ స్టార్లు కావాలి గాని వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులకు ఏకైక స్టార్ జగనే అన్నారు. మీరు ఎన్ని కుతంత్రాలు పన్నినా 2024లో వైఎస్ఆర్సిపి పార్టీ 175/175 సీట్లు గెలిచి మళ్ళీ జగన్ని సీఎం చేస్తారని హిత బోధ చేశారు.

నేడు సీపీఐ రాజోలు నియోజకవర్గ సీపీఐ సమితి సమావేశం

విశాలాంధ్ర - రాజోలు : సీపీఐ రాజోలు నియోజకవర్గ సమితి విస్తృత సమావేశం మలికిపురంలో శుక్రవారం మధ్యాహ్నం జరుగుతుందని రాజోలు ఏరియా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ దేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి కె. సత్తిబాబు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు అందరూ సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రకటన

నా క్లయింటు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామం డోరు నెం 4-120 నివాసి సానా **వెంకట్రావు గారి కుమారుడు సానా పోలరాజు** నాకు యిచ్చిన సంతాయిషీపై యావన్మందికి ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా
నా క్లయింటు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో సమీప డోరు నెం 4-137 లో **చగ156.1/2లు** ఖాళీ నివేశన స్థలము కొనుగోలు చేసి **ది.21-07-2008** వ తేదీన **దార్ల జోగిరాజు గారి భార్య పూసమ్మ అనే అనంతలక్ష్మి** అనువారి నుండి కొనుగోలు చేసి ప్రత్తిపాడు సబ్ రిజిష్టార్ కార్యాలయంలో **నెం1996/2008** గా రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగింది. తదుపరి అందలి ఖాళీ స్థలములో స్లాబు డాబాయింటిని నిర్మించినారు. సదరు దస్తావేజు **నెం1996/2008** డాక్యుమెంటుకి లింకు డాక్యుమెంటు **697/1988** అయివున్నది. నా క్లయింటు లింకు డాక్యుమెంటుని సంచిలో పెట్టుకుని **ది.12-06-2023**వ తేదీన ధర్మవరం నుండి ప్రత్తిపాడు గ్రామం ప్రయాణిస్తుండగా మార్గమధ్యంలో **697/1988** నెంబరుగల దస్తావేజు పడిపోయినది. ఈ విషయం ప్రత్తిపాడు పోలీస్ వారికి రిపోర్టు ఇవ్వడం కూడా జరిగింది. నా క్లయింటు ఈ దస్తావేజులను వెరిటస్ హౌసింగ్ ఫైనాన్స్, జగ్గంపేట బ్రాంచ్ వారికి కుదువపెట్టి డబ్బులు అప్పుగా తీసుకొనుచున్నాడు. **నెం697/1988** దస్తావేజుకి ప్రత్యామ్నాయంగా సర్టిఫైడ్ కాపీని ఆ బ్రాంచ్‌కి హామీగా డిపాజిట్ చేస్తున్నారు. కావున యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు ఒరిజినల్ దస్తావేజు ఎవరికయినా దొరికిన ఎడల నా క్లయింటుకి ఇవ్వగలరని తెలియజేస్తున్నాను. ఆ దస్తావేజు ఎవరికయినా దొరికిన ఎడల దానిని ఎవరయినా వినియోగించిన ఎడల చట్టవిరుద్ధము అగును. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనడం జరుగుతుంది. కావున ఈ ప్రకటన జారీ చేయడమైనది.

బుగత వెంకట శివన్నారాయణ, అడ్వకేటు
డోరు నెం 9-4, ప్రత్తిపాడు, ప్రత్తిపాడుమండలం,
కాకినాడ జిల్లా, సెల్: **9849064436**

రాష్ట్ర అభివృద్ధి కోసమే చంద్రబాబు, పవన్ కలిసి పోటీ

- జనసేన నాయకుడు మాజీ మంత్రి కొత్తపల్లి

విశాలాంధ్ర-మొగల్తూరు: రాష్ట్ర అభివృద్ధి కోసమే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఉమ్మడిగా పోటీ చేస్తున్నారని జనసేన నాయకులు కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. గురువారం నవ్వులూరు టీ ఆర్ కె కార్ బజార్ నందు విలేకరులతో మాట్లాడుతూ టిడిపి జనసేన కూటమి తాడేపల్లిగూడెం బహిరంగ సభ విజయవంతమైందని ఆ సభను

చూసి వైసిపి మాజీమంత్రి పేర్ని నానికి అంత భయం ఎందుకని ప్రశ్నించారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఎటువంటి స్వార్థం లేకుండా రాజకీయాలు చేస్తున్నారని పొత్తులో భాగంగా జనసేనకు 24 సీట్లు కేటాయిస్తే పవన్ కళ్యాణ్ కు చంద్రబాబుకు లేని ఇబ్బంది వైసీపీ నాయకులకు ఏమిటని అన్నారు. పవన్ కళ్యాణ్ జెండాలు మోయిస్తున్నారు అనే ముందు కమ్యూనిస్టు ,కాంగ్రెస్ పార్టీల జెండాలు మీరు మోసిన రోజులు గుర్తు చేసుకోవాలన్నారు. పవన్ కళ్యాణ్ 24 సీట్లు తీసుకుంటే మీకు ఎందుకు 23 సీట్లు తీసుకుంటే మీకెందుకు నామినేషన్ల సమయానికి మీ పార్టీకి 175 స్థానాల్లో అభ్యర్థులు ఉంటారో లేదో చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంకె రామకృష్ణ, బర్రె రామస్వామి, దంపనబోయిన సత్యనారాయణ, దేశంశెట్టి శ్రీనివాస్,మైలబత్తుల రాంబాబు, దొంగ స్వామి, ముక్కు పుల్లయ్య నాయుడు, మెండె రాజేష్, దాసరి నాగరాజు, గుడాల చింతన్న, తదితరులు ఉన్నారు.

మంచినీటి పైపులైను పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - కైకలూరు : గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందిస్తున్నామని కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలం లోని నత్తగుల్లపాడు,రామవరం గ్రామాలలో రూ: 31.20 లక్షల నిధులతో మంజూరై

నిర్మించబోతున్న మంచి నీటి పైపు లైను పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొని కొబ్బరికాయ కొట్టి లాంఛనంగా ప్రారంభించారు. ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్, జడ్పీటీసీ కురేళ్ళ బేబి,వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధం

విశాలాంధ్ర- పాలకోడేరు: రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 18 వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు మండలంలో ఉన్న పదకొండు ప్రభుత్వ పాఠశాలలు,రెండు ప్రైవేట్ పాఠశాలల నుండి మొత్తం 645 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నట్లు మండల విద్యాశాఖాధికారి-1 పెనుమత్స వెంకట శివ నాగరాజు తెలియ జేశారు.వీరందరికీ పాలకోడేరు, మోగల్లు, గొల్లలకోడేరు, విస్సాకోడేరు శృంగవృక్షం ఉన్నత పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా కేటాయించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాల లలో చదివే విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు అందుకోసం ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖకారి తెలిపారు.

జనసేన, టిడిపి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కడతారు

మాజీ మంత్రి పితాని సత్యనారాయణ

విశాలాంధ్ర-పోడూరు: రాబోయే ఎన్నికలలో జనసేన, టీడీపీ ప్రభుత్వానికి పట్టం కట్టటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి పీతాని సత్యనారాయణ పేర్కొన్నారు. ఆచంట నియోజకవర్గం లో పీతాని చేస్తున్న ఇంటింటి పాదయాత్రలో భాగంగా గురువారం పోడూరులో

ప్రధాన వీధులలోనూ, గరగలమ్మ గుడి సెంటర్, వెలగలమ్మ చెర్వు ప్రాంతాలలో స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటి పాదయాత్ర జరిపారు. పీతాని పాదయాత్రకు ప్రజల నుండి మంచి స్పందన లభించింది. అడుగడుగునా మహిళలు హారతులు పడుతూ పూల వర్షం కురిపిస్తూ నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకే చంద్రబాబు పవన్ కళ్యాణ్ ఒక్కటయ్యారని అన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి సాగనంపనున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, టిడిపి పోడూరు మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, ప్రధాన కార్యదర్శి బొక్కా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన సభతో నిరాశలో జగన్

విశాలాంధ్ర-పెదవేగి: తాడేపల్లిగూడెం సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని, లక్షలాదిగా తరలి వచ్చిన టిడిపి, జనసేన కార్యకర్తల ఉత్సాహం చూసి వైసిపి అగ్ర నాయకుడు నుంచి కార్యకర్తలు సైతం నిరాశలో కుంగి పోయారని రాష్ట్ర ప్రభుత్వ మాజీ విప్, దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఒక ప్రకటనలో

తెలిపారు..వైసీపీ దొంగలకు వ్యతిరేకంగా తేదేపా జనసేన పోరాడుతున్నాయని, రాబోయే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమని, టీడీపీ జనసేన చేతులు కలిపింది తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం, అధికారం కోసం కాదని అన్నారు. జగన్ లాగా ప్రజల సొమ్ము దోచుకోకుండా, సంక్షేమ పథకాలు నిజాయితీ గా అమలు చేస్తామని, సాగునీరు అందించి రైతులను ఆదుకుంటామని, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, తెలిపారు.

ఏలూరు అసెంబ్లీలో వైసీపీ ఖాళీ

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్రంలో సైకో సీఎం జగన్ అధర్మ పాలనలో ఇమడలేక, కనీస గౌరవ మర్యాదలు దక్కక ఎంతోమంది వైసిపికి గుడ్ బై చెప్పి టిడిపిలో చేరుతున్నారని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఉన్నారు. ఏలూరు కార్పొరేషన్ 12వ డివిజన్ కార్పొరేటర్ కర్రి శ్రీనివాస్, 30వ డివిజన్ కార్పొరేటర్ పప్పు

ఉమామహేశ్వరరావుతో పాటు మాజీ కార్పొరేటర్లు కొలూరి చంద్రశేఖర్, మాగంటి హేమ సుందర్, పిలగల ప్రకాష్‌లు అధికార వైసిపికి రాజీనామా చేసి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ సమక్షంలో తెదేపాలో చేరారు. ఈ సందర్భంగా ఏలూరు పవర్‌పేటలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏలూరు అసెంబ్లీ అభ్యర్థి బడేటి చంటి మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన సీఎం జగన్ హయాంలో ఏ ఒక్క వర్గానికి రక్షణ లేకపోగా, కనీస గౌరవ మర్యాదలు కరువయ్యాయని అన్నారు. త్వరలో మరో 18 మంది కార్పొరేటర్లు టిడిపిలోకి రానున్నారని, దాంతో ఏలూరు నియోజకవర్గంలో వైసిపి పూర్తిగా ఖాళీ అవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో కవులూరి చంద్రశేఖర్, పిలగల ప్రకాష్, మాగంటి హేమసుందర్, ఏలూరు నగర టిడిపి అధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ వేడుకలు

విశాలాంధ్ర- తాళ్ళపూడి : స్వర్ణ భారతి స్కూల్ నిర్వాహకులు రామకృష్ణ రాజు ఆధ్వర్యం లో జాతీయ సైన్స్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ పద్మ సైన్స్ గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులచే వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లి తండ్రులు పాల్గొన్నారు.

నిధులు మావి పోటీలో మీవా?

- ప్రపంచ స్థాయిలో భారత్‌కు ప్రత్యేక స్థానం

విశాలాంధ్ర - సీతానగరం: నిధులు మావి పోటీలో మీవా అంటూ అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి అన్నారు. మండలంలోని సీతానగరం ప్రధాని బస్టాండ్‌లో భాజపా అసెంబ్లీ కన్వీనర్ నిరుకోండ వీరన్న చౌదరి పార్టీ పిలుపు మేరకు ప్రజా పోరు యాత్ర నిర్వహిస్తున్నారు. దీనిలో

భాగంగా ఆటోలో తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్మించిన ఆర్‌బి కే , సచివాలయాల పై కనీసం ప్రధాన మంత్రి మోడీ పోటీలో వేయడం లేదు అని అన్నారు. మండలంలో గత నాలుగు సంవత్సరాలుగా 18కిమి రోడ్డు రాష్ట్ర ప్రభుత్వం నిర్మించ లేకపోయింది కానీ కేంద్రం నాలుగు వేల కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మించింది అని అన్నారు. ఒకప్పుడు మండలంలో కొండలు ఉండేవి అని చెప్పుకునేలా దోచేశారు అని అన్నారు. ప్రపంచ స్థాయిలో 5వ స్థానంలో మన భారతదేశాన్ని నిలబెట్టిన ఘనత ప్రధాని మోడీది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఇంఛార్జి ఏ పి అర్ చౌదరి, మండల కన్వీనర్ జయరామ్, యువ మూర్ఖ నగేష్, బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ

విశాలాంధ్ర-కొవ్వూరు : లీప్ సంవత్సరం సందర్భంగా అంతర్జాతీయ అధ్యక్షులు ఆదేసుసారం వాసవి క్లబ్ కొవ్వూరు ఆధ్వర్యంలో గురువారం బియ్యం పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ వలివేటిప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నాలుగు సంవత్సరాలకు వచ్చే లీప్

సంవత్సరం సందర్భంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు, సత్యవతి నగర్ లో ఉన్న రక్షక గణపతి మందిరానికి అన్నదాన నిమిత్తం26 కేజీలు, మదర్ తెరిసా అనాధాశ్రమానికి 26 కేజీలు, వాత్సల్య వృద్ధాశ్రమంకు 26 కేజీలు, టోల్గేట్ వద్ద ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన నిమిత్తం 26 కేజీలు సంస్కృత పాఠశాల శివాలయంలో అన్నదాన నిమిత్తం 26 కేజీలు రావణ బ్రహ్మ శివాలయంలో అన్నదానం నిమిత్తం 26 కేజీలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ వలివేటి ప్రసాద్, వాసవి క్లబ్ కొవ్వూరు గలక్సీ చైర్మన్ మద్దుల వీర వెంకట సత్యనారాయణ, క్యాబినెట్ కోశాధికారి పలుకురి రామారావు, వాసవి క్లబ్ కొవ్వూరు అధ్యక్షులు దేవతు కృష్ణ ప్రసాద్ కార్యదర్శి రాఘవ రమాకాంత్ కోశాధికారి సత్యవరపు గురునాద్ కొత్త సురేష్ కుమార్ పెరుమాళ్ళ వీరాశ్వరరావు నాగుబండి గంగరాజు పాల్గొన్నారు.

తీరాలు దాటుతున్న ఎర్ర కాలువ ఇసుక

విశాలాంధ్ర- నల్లజర్ల : నల్లజర్ల మండలం నవీపేట గ్రామంలోని పోతవరం ఎర్ర కాలువ లో నుండి ఇసుక యథేచ్ఛగా రోజూ 30 లేదా 40

ట్రాక్టర్ల 12 టైరు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నది. గ్రామంలోని వారి అవసరాలకు ఇసుక దొరకడం లేదు. జగనన్న కాలనీల కోసమని చెప్పి ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి అధిక రేట్లు వసూలు చేస్తున్నారు. ట్రాక్టర్లతో ఇసుక తరలించి అధిక రేటుకు విక్రయిస్తున్నారు. గ్రామంలో ఎవరైనా పేదలు ఇసుకను ఇంటి అవసరమై తెచ్చుకుంటే వారి మీద చర్యలు తీసుకుంటున్నారు కానీ ఇతర గ్రామాలకు తరలించుకుపోతున్న వారి మీద ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

నాలుగు లక్షల మందికి ఉద్యోగాల్చిన ఘనత జగన్‌దే

విశాలాంధ్ర - తాళ్ళపూడి :వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థలను తీసుకువచ్చి తద్వారా నాలుగు లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ముఖ్య మంత్రి జగనన్నకే దక్కిందని కొవ్వూరు వైకాపా ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పేర్కొన్నారు. గురువారం తాళ్ళపూడిలో వలేంటీర్లకు వందనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే తలారి, రాజమండ్రి పార్ల మెంటరీ వైకాపా ఇంచార్జి గూడూరి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా విచ్చేసారు. తలారి మాట్లాడుతూ నాయకులకంటే ఎక్కువ ప్రాధాన్యత జగనన్న వలంటీర్లకే ఇచ్చారని తెలిపారు. ప్రతి 50 కుటుంబాలకు జరిగిన సంక్షేమం మరో సారి ప్రజలకు గుర్తు చేసి జగనన్న ప్రభుత్వాన్ని మరో సారి గెలిపించే దిశగా కృషి చేయాలని కోరారు. ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, వైకాపా ప్రభుత్వంలోనే ప్రజలకు మంచి జరిగిందని, జగనన్న ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతి పక్షాలు అధికారం లో వున్నప్పుడు సంక్షేమాన్ని ఎందుకు అందించ లేకపోయారని ప్రశ్నించారు. . తాళ్ళపూడి మండలం లో 210 మంది వాలేంటీర్లుండగా తాళ్ళపూడి, అన్నదేవరపేట గ్రామాల వలేంటీర్ల ఇద్దరికి వజ్ర, మరో ఐదుగురికి రత్న అవార్డులను అంద చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పి వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, వైస్ ఎంపీపీ కోదటి కనకం, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మొరార్జీ దేశాయ్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - కొత్తపేట : భారత మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ జయంతి సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆర్. అనురాధ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ 1896 ఫిబ్రవరి 29న గుజరాత్ రాష్ట్రంలో బల్సార్ జిల్లాలో భీదేలీ గ్రామంలో జన్మించారని, దేశానికి 4వ ప్రధానిగా 1977 మార్చి 24 నుండి 1979 జులై 26 వరకు పని చేసారని తెలిపారు. ముంబాయిలో విల్సన్ కాలేజిలో విద్యాభ్యాసం పూర్తి చేశారని, జనతా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసారని తెలిపారు. ది స్టోరీ ఆఫ్ లైఫ్ అనే గ్రంథాన్ని రచించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని నివాళులు అర్పించారు.

4వ రోజు అమరేశ్వర స్వామి కళ్యాణం

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని ఇర్రిపాకలో నిర్వహిస్తున్న కోటి పార్థివ శివలింగ మహారుద్రాభిషేకం కార్యక్రమంలో 4వ రోజు గురువారం శ్రీ శృంగేరి శ్రీ వీరుపాక్ష పీఠాధిపతులు శ్రీ జగద్గురు గంభీరానంద భారతీ మహాస్వామి పాల్గొన్నారు. టిడిపి నేత జ్యోతుల నెహ్రూ కుటుంబం ఆధ్వర్యంలో



ఈనెల 26 నుండి మార్చి 7వ తేదీ వరకు కోటి పార్థీవలింగ మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా 4వ రోజు విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి రుద్రాభిషేకము, బిల్వార్చన, కుంకుమార్చన, సౌర హోమం, వంటి పూజలతో పాటు అమరేశ్వర స్వామి కళ్యాణం నిర్వహించారు. జ్యోతుల నెహ్రూ మణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు పీటలపై కూర్చుని ఈ పూజలు చేశారు. ఈ కార్యక్రమాన్ని అధిక సంఖ్యలో భక్తులు తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు.

పారిశుధ్య నిర్వహణపై అంత నిర్లక్ష్యమా?

విశాలాంధ్ర - పెద్దాపురం : పట్టణ పారిశుధ్య నిర్వహణ, అభివృద్ధి పనులపై శానిటరీ, ఇంజినీరింగ్ అధికారుల వ్యవహార తీరుపై పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ మండిపడింది. పారిశుధ్య నిర్వహణపై అధికారులు ఇంత నిర్లక్ష్యమా..? సభ్యులు అడిగితేనే ఫ్రైడే డ్రైడే నిర్వహిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్లు, పైపులైన్ల నిర్వహణలో ఇంజనీరింగ్ అధికార్ల అలసత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, ఆరెళ్లి వీర్రాఘవులు, పప్పుల దుర్గారావులు మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నంగా ఉందన్నారు. పారిశుధ్య సిబ్బంది తక్కువగా ఉన్నారంటే స్థానికంగా కొంతమందిని తీసుకుని పారిశుధ్య పనులు మెరుగుపర్చాలని పలు సమావేశాల్లో చెబుతున్నా ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారంటూ కౌన్సిలర్ ఆరెళ్లి వీర్రాఘవరావు మండిపడ్డారు. కమిషనర్ కెవి పద్మావతి సమాధానం ఇస్తూ ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే పారిశుధ్య పనులు నిర్వహించే వీలుందని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్లో సిబ్బందిని తీసుకునే అవకాశం లేదన్నారు. పప్పల దుర్గారావు మాట్లాడుతూ దీని కారణంగా పారిశుధ్య పనులు గాలికి వదిలేస్తారా..? కనీసం వారానికి ఒక్కసారి మూకుమ్మడిగా నిర్వహించే ఫ్రైడే డ్రైడే

కార్యక్రమం కూడా సభ్యులు అడిగితేనే నిర్వహిస్తారా..? అని అధికారులను నిలదీశారు. శానిటరీ ఇన్స్పెక్టర్ దావీదురాజు మాట్లాడుతూ ఫ్రైడే రోజున తప్పని సరిగా సామూహికంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామని, వార్డు శానిటరీ మేస్త్రీ పరిధిలో డ్రైడే నిర్వహించడం జరుగుతుందన్నారు. వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ శానిటరీ నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవరిస్తే సహించేది లేదన్నారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ గతంలో గ్యాంగ్ వర్క్ చేసేవారని ఇప్పుడు ఎందుకు అలా గ్యాంగ్ వర్క్ పెట్టి పారిశుధ్య పనులు నిర్వహించడం లేదన్నారు. తక్షణమే పారిశుధ్య పనులు మెరుగుదలకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక మెయిన్ రోడ్లు ఆంజనేయస్వామి గుడి వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై ఇంజినీరింగ్ అధికారులు ఇప్పటికీ నిర్లక్ష్య వైఖరి సరి కాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ తాటికొండ వెంకటలక్ష్మి మాట్లాడుతూ మా వార్డులో డ్రెయిన్ కల్వర్టులు నిర్మాణంపై ఇంజినీరింగ్ అధికారుల తీరు చాలా దారుణంగా ఉందని ఇది సరైన పద్ధతి కాదని ఆవేదన వెలిబుచ్చారు. వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ ఆ వార్డులో పనులు టెండర్ దశలో ఉన్నాయని, సత్వరమే వార్డులో కల్వర్టు, డ్రెయిన్ నిర్మాణాలపై ఇంజినీరింగ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. పైపులైన్ల ఏర్పాటు, డ్రెయిన్ల నిర్మాణాలపై ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్య వైఖరి సరికాదరని సభ్యులు ధ్వజమెత్తారు. ఇంజనీరింగ్, శానిటరీ అధికారులపై తీరుపై కౌన్సిల్ సభ్యులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తడంతో సమావేశం వాడీవాడిగా కొనసాగింది. మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా స్థలాలను గుర్తించి వాటికి రక్షణ కల్పించాలని వైస్ చైర్మన్ సాయి ప్రసాద్, చైర్ పర్సన్ తులసీ మంగతాయారులు ఆదేశించారు. పట్టణం దోమల బెడద ఎక్కువ ఉందని సత్వరమే అన్ని వార్డుల్లో ఫాగింగ్ చేయించి దోమల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని శానిటరీ ఇన్స్పెక్టర్ దావీదు రాజును ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై వాడివేడి చర్చ సాగింది. ఈ సమావేశంలో కమిషనర్ కెవి మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డిఇఇ ఆదినారాయణ, ఆర్ఎ చంద్రశేఖకం, కౌన్సిలర్లు తృలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, పెంటకోట సత్తిబాబు, పేరింశెట్టి అంబిక, గడపా రామలక్ష్మి, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ. వాసంశెట్టి గంగతో పాటు ఆయా వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం ప్రచారం చేద్దాం

విశాలాంధ్ర - పెద్దాపురం : ఎన్నికల శంఖారావం పేరుతో నియోజకవర్గంలో ప్రతి ఇంటింటికీ వెళ్ళి ప్రజలను కలవాలని పార్టీ నాయకులకు పెద్దాపురం టీడీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప విజ్ఞప్తి చేశారు. పార్టీలో చేరేందుకు ఎవరు ముందుకొచ్చిన చేర్చుకునేందుకు సంసిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. పెద్దాపురం క్యాంపు కార్యాలయం ఆవరణలో గురువారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన నియోజక వర్గ టీడీపి నాయకులతో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారం ఏ విధంగా చేపట్టాలి, ఎలా ప్రజల వద్దకు వెళ్ళాలి, నోటిఫికేషన్ ముందు, వచ్చిన తర్వాత ప్రచారం చేసే తీరును చినరాజప్ప వివరించారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం రాబోతుందని, మంచి మెజారిటీతో గెలిపించడానికి ప్రయత్నం చేయాలని అన్నారు. తన మీద నమ్మకం ఉంచి చంద్రబాబు, లోకేశ్ తిరిగి తనకు టిక్కెట్ ఖరారు చేసినందుకు చంద్రబాబుకు మరోసారి చినరాజప్ప ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సభలో మాజీ మునిసిపల్ చైర్మన్ టీడీపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాజా సూరి రాజు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు, పెద్దాపురం తెదేపా మండల పార్టీ అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించాలంటూ సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ నిరసన ర్యాలీ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : బిజెపిని గద్దెదించాలంటూ సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఆ పార్టీ శ్రేణులు నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కార్యాలయం నుండి నగర పురవీధుల గుండా ఆ పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యులు బుగతా బంగార్రాజు ఆధ్వర్యంలో నిరసనను చేపట్టారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ దేశంలోని మోదీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణి కొనసాగుతుందని రాష్ట్రాల్లో కూడా ముఖ్యమంత్రులను సైతం కేంద్రం ప్రభావితం చేస్తూ పరిపాలన కొనసాగిస్తుందని మోడీ ప్రభుత్వాన్ని ఆయన దుయ్య పట్టారు. అంతేకాకుండా రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమిని బలపరచాలని అన్నారు. బిజెపికి వ్యతిరేకంగా ఉన్న వ్యక్తులపై కేసులను బనాయిస్తూ పరిపాలన కొనసాగించడం మోడీకే దక్కిందని ఆయన అన్నారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని మోడీకి మద్దతు ఇస్తున్న తెలుగుదేశం, జనసేన పార్టీతో పాటు అధికార పార్టీ అయినా వైసీపీ పార్టీని కూడా గద్దెదించాలని, వామపక్షాలను బలపరచాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఏగుపాటి అర్జునరావు, మానుకొండ లచ్చబాబు, సామిరెడ్డి నారాయణమూర్తి, కే మూర్తి, అధిక సంఖ్యలో సీపీఐ ఎంఎల్ కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జెండా పీకిన దుండగులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని తూర్పు లక్ష్మీపురం గ్రామంలో బిజెపి జెండాను పీకి పారేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని బిజెపి కాకినాడ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇటీవలే కాలంలో నూతనంగా జెండా స్థూపాన్ని నిర్మించి, పార్టీ జెండాను ఆవిష్కరించడం జరిగిందని అన్నారు. బిజెపికి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక గుర్తు తెలియని దుండగులు జెండా స్థంభంను వంచి, జెండాను పక్కన ఉన్న మురికి కాలువలో పడేయడం దారుణమని అన్నారు. ఈ చర్యకు పాల్పడిన వారిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు. ఈ దుర్మార్గమైన చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనియెడల పార్టీ శ్రేణులతో కలిసి ఉద్యమం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కురాకుల రాజా, పట్టణ అధ్యక్షుడు రెడ్డి లోవరాజు, ఏనుగు సుబ్రహ్మణ్యం, పతివాడ వెంకటేశ్వరరావు, కోట నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ముగ్గురు మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపన

విశాలాంధ్ర - మండపేట : ప్రజల ఆకాంక్ష మేరకు మండపేట పట్టణంలో త్వరలో మరో ముగ్గురు మహానుభావుల విగ్రహాలు ప్రతిష్టించి వారి చిరకాల కోరిక నెరవేర్చనున్నామని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. నిమ్న జాతుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తన జీవితాన్ని దారపోసిన జ్యోతిరావు పూలే, బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యల పట్ల పోరాటానికి దిగి తన జీవితాన్ని త్యాగం చేసిన సర్దార్ వంగవీటి మోహనరంగా, ఎమ్మెల్యే గాను, గుప్తదాతగా మండపేట నియోజకవర్గ ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్న స్వర్గీయ వీవీఎస్ఎస్ చౌదరిల కాంస్య విగ్రహాలను మెయిన్

రోడ్డులో నెలకొల్పడానికి గత నెల కౌన్సిల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆమోదింప చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఆ ముగ్గురి మహనీయుల విగ్రహాలను స్థానిక ఎన్టీఆర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకున్నారు. గురువారం బీసీ, ఓసీ సంఘాల నాయకులతోను, చౌదరి అభిమాన నాయకులతో కలిసి ఆయన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు కోన సత్యనారాయణ, రెడ్డి రాధాకృష్ణ, పిల్లి గనేశ్వరరావు, జిన్నూరి సత్య సాయిబాబాలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ విగ్రహాలు ఏర్పాటుకు సంబంధించిన పనులను శనివారం మొదలు పెట్టడానికి నిర్ణయం తీసుకున్నామని, ఆ రోజున అందరూ రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిల్లి శ్రీనివాస్, మందపల్లి రవి కుమార్, మెండు బాపిరాజు, పేపర్తి సాంబు, పెంకే గంగాధర్, పంపన శ్రీనివాస్, ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, రామోజి కృష్ణ, కొప్పిరెడ్డి కృష్ణ, కోళ్ళ శ్రీనివాస్, పితాపురం సత్యనారాయణ, పెంకే వెంకట్రావు, పాలంకి కమల, మల్లువలస గణపతి, పులగం శ్రీనివాస్, ఈలి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని తు.చ తప్పకుండా పాటించాలని ఏఈఆర్ఓ, తహసీల్దార్ వారి ఆధ్వర్యంలో, ఎస్‌డబ్ల్యూఇఇపి2024 ఈవీఎంల అవగాహన కార్యక్రమంలో భాగంగా పివో, ఎపివోగా విధులు నిర్వహించనున్న మహిళా ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల విధులకు సంబంధించిన సమావేశం ఎంపీడీవో ఎస్. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వెంకట రామయ్య, తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాల మేరకు ఎన్నికల నిర్వహణ పారదర్శకతతో నిర్వహించవలసి వుంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఎదురైతే వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో అవగాహన కలిగియుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్. వెంకటేశ్వరరావు, పివి ప్రసాద రావు, యంఈఓ పచ్చా సాహెబ్, మండల ఈవీఎం మాస్టర్ ట్రైని ఎస్. ప్రసాద్, మండలంలోని మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగన్మోహిని కేశవ స్వామికి లక్ష రూపాయల విరాళం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో ర్యాలీ గ్రామంలోని వెలిసిన పురాతనమైన దేవాలయాల్లో విశిష్ట కలిగిన ఆలయం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయం. ఆలయంలో ముందు పురుషుని రూపం వెనుక స్త్రీ రూపంలో భక్తులకు స్వామి వారు దర్శనం ఇస్తారు. విజయవాడ పట్టణానికి చెందిన నల్లమోతు విశ్వనాథరావు జగన్మోహనీ కేశవ స్వామి అన్నదాన పథకానికి రూ.1,00,116లు విరాళం అందించారు. వీరిని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించగా కార్యనిర్వహణ అధికారి బి కృష్ణ చైతన్య స్వామి వారి చిత్రపటం

చరిత్ర కలిగిన పుస్తకం శేష వస్త్రలలో సత్కరించారు.